క్లుప్తంగా

ఉమామహేశ్వరరావుకు అబ్దుల్ కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డు



మద్దిలపాలెం : డాక్టర్ వి.ఎస్. కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంస్కృత అధ్యాపకుడు, జాతీయ సేవా పథకం అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావుకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డుకు ఎంపికయ్యారు. కలకత్తాలోని వెల్ రెడ్ ఫౌండేషన్ సంస్థ వివిధ విభాగాల్లో ప్రకటించిన అవార్డుల్లో.. ఉమామహేశ్వరరావుకు సోషల్ సర్వీస్ విభాగంలో అవార్డు దక్కింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి బెస్ట్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డు పొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు శనివారం కళాశాలలో ఉమామహేశ్వరరావును అభినందించారు.

ఆహార కల్తీకి పాల్పడిన ఐదు షాపులకు జారిమానా

బీచ్‌రోడ్డు: జిల్లా సహాయ ఆహార నియంత్రణ అధికారి ఆధ్వర్యంలో నగరంలో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో సేకరించిన ఆహారపదార్థాల శాంపిల్స్‌లో కల్తీ ఉన్నట్టు నిర్ధారణ అయింది. దీంతో ఐదు షాపులకు జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ జరిమానా విధించారు. కంచరపాలెం సంజీవ సాయి ఫ్లోర్ మిల్‌కు రెండు కేసుల్లో రూ.15 వేలు, పెదగంట్యాడ రత్నావారి వంటిల్లుకు రూ.5 వేలు, ఎన్ఏడీ కొత్త రోడ్డులోని చందు స్వీట్స్‌కు రూ.10వేలు, శ్రీలక్ష్మి జనార్దన్ బెంగళూర్ వారి అయ్యంగారి బేకరీకి రూ.10వేలు జరిమానా విధించారని జిల్లా సహాయ ఆహార నియంత్రణ అధికారి నందాజీ తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి విశాఖ ఐ హాస్పిటల్ జంక్షన్ వరకు రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన బడ్డీలు, పండ్ల షాపులను జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల సహకారంతో ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని షాపులను ఏర్పాటు చేయటం వలన ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయన్నారు.

బయో డైవర్సిటీ పార్క్‌ను సందర్శించిన విద్యార్థులు



ఈక్విసిటమ్ మొక్క కోసం తెలుసుకుంటున్న విద్యార్థులు

బీచ్‌రోడ్డు: వరల్డ్ వాటర్ డే సందర్భంగా పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్‌ను శనివారం విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా పార్క్ నిర్వాహకుడు డాక్టర్ రామ్మూర్తి మాట్లాడుతూ ఈ ఏడాది వాటర్ డే థీమ్ గ్లేసియర్స్ ప్రిజర్వేషన్ అని అన్నారు. అనంతరం విద్యార్థులకు అరుదైన 'ఈక్విసిటమ్' మొక్క కోసం వివరించారు. ఇది సాధారణంగా హార్స్‌టెయిల్స్ అని పిలుస్తారన్నారు. శతాబ్దాలుగా సంప్రదాయ వైద్యంలో ఉపయోగిస్తున్నారన్నారు. మూత్రపిండాల్లో రాళ్లను తొలగించడంలో, ఎముకలను బలోపేతం చేయడంలో సహాయపడుతుందన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న శామ్యూల్

విశాఖ విద్య: సమాచార హక్కు చట్టం అమలు పటిష్టంగా జరగాలని రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ శామ్యూల్ జోనాథన్ అన్నారు. శనివారం ఏయూ పాలకమండలి సమావేశం మందిరంలో ఆయన ఏయూ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శామ్యూల్ జోనాథన్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సక్రమంగా అమలు చేయడం వలన వ్యవస్థలో జవాబుదారీతనం, పారదర్శకత పెరుగుతాయన్నారు. సమాచారాన్ని ఒక హక్కుగా పొందడం ఈ చట్టం ద్వారా సాధ్యపడుతుందని తెలిపారు. సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయడంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరుగ్గా పనిచేస్తోందని తెలిపారు. సమాచార హక్కు చట్టంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య ఈ ఎన్ ధనంజయరావు పలువురు డిప్యూటీ రిజిస్ట్రార్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమకు ఏయూ ఉద్యోగుల సందేహాలను సమాచార హక్కు కమిషనర్ నివృత్తి చేశారు.

జూలో..కూల్‌కూల్

• ఏనుగులు, చింపాంజీలకు ప్రత్యేక చర్యలు..



నీకు కీరదోస..నాకు వాటర్ మిలన్

వాటాలు వేసుకుంటున్న స్క్వేరెల్ మంకీస్

చింపాంజీల కోసం ఫ్యాన్లు · **కోతుల నైట్ షెల్టర్‌పై వైట్ వాష్**

ఇక్కడ ఏనుగులు, చింపాంజీలకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఏనుగులకు అధికంగా నీరు అవసరం. వాటికి రోజూ స్నానం కోసం, తాగడానికి ఎక్కువ నీరు అవసరమవుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఐదేళ్ల క్రితం ఏనుగుల మోటోలో నీటి తొట్టి నిర్మించారు. ఆ తొట్టిలో అవి స్నానం చేయడనికి వీలుగా ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ప్రత్యేకంగా 10,000 లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకు వాటి కోసం ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఇక్కడ ఉన్న చింపాంజీ నైట్‌క్రాల్స్‌లో చల్లదనం కోసం ప్యాన్‌లు, కూలర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఒంటరిగా ఉన్న చింపాంజీకి ప్రత్యేకంగా కొబ్బరి బొండాల నీరు, పాలిబియాన్, గ్లూకోజ్ నీటిని అక్కడ యానిమల్ కీపర్ తరుచూ అందిస్తున్నారు.

ఆరిలోవ: ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో ఇందిరాగాంధీ జూ పార్కులో వన్యప్రాణులు విలవిల్లాడుతున్నాయి. జంతువులు, వాటి ఎన్‌క్లోజర్లలో చెట్ల నీడకు వెళ్లి సందర్శకులకు దూరంగా సేదదీరుతున్నాయి. జంతువులు అరుపుల్లో గంభీరం తగ్గిపోయింది. జూలో కిలకిలరావాలు మూగబోయాయి. జూ అధికారులు ఎండల నుంచి ఉపశమనం కోసం వన్యప్రాణులకు చల్లని సపర్యలు చేపడుతున్నారు. ఇక్కడ వన్యప్రాణులతో పాటు సందర్శకుల కోసం తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎండ తీవ్రత నుంచి ఇక్కడ మూగ జీవాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండడానికి నీడ, చల్లదనం కల్పిస్తున్నారు. వాటికి తాగడానికి నీటిని అందిస్తున్నారు. ఆహారం విషయంలో మార్పులు చేస్తున్నారు. నీటి శాతం ఎక్కువగా ఉండే ఆహారం అందిస్తున్నారు. వాటి అరోగ్యంలో మరింత జాగ్రతలు తీసుకొంటున్నారు. జూలో జింకలు, కనుజులు, కోతులు, స్క్వేరెల్‌మంకీస్, పులులు, ఎలుగుబంట్లు, సింహాలు, చింపాంజీలు ఎన్‌క్లోజర్లలో తాటాకులతో పాకలు వేస్తున్నారు. ఇప్పటికే వీటి ఎన్‌క్లోజర్లలో స్ప్రింక్లర్లు అమర్చారు. ఏనుగుల ఎన్‌క్లోజర్‌లో గతంలో వేసిన ఎత్తయిన తాటాకుల పందిరికి మరమ్మతులు చేపట్టి నీటితో తడుపుతున్నారు. అన్ని వన్యప్రాణుల ఎన్‌క్లోజర్లలో ఉండే నైట్ క్రాల్స్‌పై చల్లదనం కోసం వైట్ వాష్ వేస్తున్నారు. వాటికి కావాల్సినంత నీటిని అందుబాటులో ఉంచారు. ప్రతి ఎన్‌క్లోజర్‌లోకి పైపులు, కుళాయిల ద్వారా నీటిని అందిస్తున్నారు. వన్యప్రాణులు నీరసించిపోకుండా ఉండడానికి ఆరోగ్యపరమైన చర్యలు కూడా చేపడుతున్నారు. వాటికి పాలిబియాన్, గ్లూకోజ్ పౌడర్‌ను నీటిలో కలిపి అందిస్తున్నారు. చింపాంజీలకు కొబ్బరి బండాల నీరు తాగిస్తున్నారు. పక్షుల ఎన్‌క్లోజర్లలో వట్టివేళ్ల (కస్‌కస్ గడ్డి)తో తయారు చేసిన చాపలు వేసి చల్లదనం ఇవ్వడానికి వాటిని ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సమయాలలో పలుసార్లు నీటితో తడుపుతున్నారు. పాముల జోన్‌లో నీటి స్ప్రింక్లర్లు ఏర్పాటు చేశారు. ఆ నీటి తుంపర్లు పాముల గూళ్లలోకి వెళ్లేటట్లు ఏర్పాటు చేశారు.



బియర్..నో ఫియర్ పాక నీడలో నీటి కుండీలో సేదదీరుతున్న ఎలుగుబంటి..



బుసకొట్టేలా..: పాముల జోన్‌లో నీటి స్ప్రింకలర్లు



చల్లచల్లగా..: కోతుల నైట్ షెల్టర్‌పై వేసిన వైట్ వాష్



చింపాంజీల కోసం ఏర్పాటు చేసిన ఫ్యాన్లు



కోతుల ఎన్‌క్లోజరులో వేస్తున్న తాటి కమ్మలు పాక

• సందర్శకులకు కోసం..

జూకు వచ్చే సందర్శకుల కోసం ఇక్కడ ఆరు చోట్ల ఆర్వో ప్లాంట్లు అందుబాటులో ఉన్నాయి. వారికోసం పలుచోట్ల నీటి ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. ఎక్కువచోట్ల సందర్శకులు విశ్రాంతి కోసం షెడ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఏనుగులు, పులులు, ఎలుగుబంట్లు, జింకలు, కణుజులు, జిరాఫీలు ఎన్‌క్లోజర్లు వద్ద, పక్షులు, పాములు, కోతులు జోన్ల వద్ద షెడ్‌లను శుభ్రం చేయించి అందుబాటులో ఉంచారు.



ఎన్‌క్లోజర్లలో సౌకర్యాలు..

జూలో అన్ని ఎన్‌క్లోజర్లలోనూ సౌకర్యాలు కల్పించాం. ఇక్కడ 90 రకాల జాతులకు చెందిన సుమారు 850 వన్యప్రాణులున్నాయి. అవి ఉండే ఎన్‌క్లోజర్లలో వేసవి చర్యలు చేపడుతున్నాం. వన్యప్రాణులకు రోజూ ఇచ్చే ఆహారంలో మార్పులు చేస్తున్నాం. అదనంగా నీరు అధికంగా సరఫరా చేయడం, తాగు నీటిలో శక్తి కోసం గ్లూకోజ్, ఎలక్ట్రోలైట్స్, పాలిబియాన్ పౌడర్ కలపి ఇస్తున్నాం. రోజూ వేసినదానికంటే ప్రస్తుతం ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయాలు మరింత ఎక్కువగా అందిస్తున్నాం.

–జి.మంగమ్మ, క్యూరేటర్, జూ పార్కు

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



ఈ-తరంగ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ-తరంగ్-2025 పేరిట రెండు రోజుల పాటు నిర్వహించనున్న టెక్నో కల్చరల్ ఫెస్ట్ శనివారం వేడుకగా ప్రారంభమైంది. ఫెస్ట్ ప్రారంభోత్సవం వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన డా. కె. కుమార్ రాజా (మేనేజింగ్ డైరెక్టర్ - కె.కుమార్ రాజా ప్రాజెక్ట్)విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. నూతన విషయాలపై అవగాహన, పరిశోధన రంగాల్లో అవకాశాలు దక్కించుకునేలా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా కళాశాల ఈసీఈ హెచ్‌వోడీ ప్రొఫెసర్ పీవీ శ్రీదేవి మాట్లాడుతూ, ప్రస్తుత టెక్నాలజీ యుగంలో విద్యార్థుల క్రియాశీలత, వినూత్న ఆలోచనల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్. పద్మశ్రీ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, ప్రాక్టికల్ జ్ఞానాన్ని పొందేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. సీఎస్ఈ హెచ్‌వోడీ ఆచార్య బి.ప్రజ్ఞ, సివిల్ హెచ్‌వోడీ డా.జి.శిరీష, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డా.ఎస్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం చివరిలో అధ్యాపకులకు సన్మానించారు. అదే విధంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఆత్మ జ్ఞానంతోనే పరమాత్ముని దర్శనం



అభిషేకంలో పాల్గొన్న అర్చకులు

బీచ్‌రోడ్డు : పెదవాల్తేరులోని అసంగానంద ఆశ్రమం 50వ వార్షికోత్సవం ఆశ్రమ అధ్యక్షుడు విష్ణు సేవానందగిరి సారథ్యంలో ఘనంగా నిర్వహించారు. రెండు రోజులు పాటు పరమేశ్వరునికి అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు నిర్వహించారు. వార్షికోత్సవం ముంగిపు వేడుకల్లో సంపూర్ణానందగిరి స్వామి భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి ఒక్కరికి భక్తితో పాటు ఆత్మజ్ఞానం కూడా ఉండాలన్నారు. పరిపూర్ణమైన ఆత్మజ్ఞానం కలిగిన వారికి మాత్రమే పరమాత్ముని దర్శనం లభిస్తుందన్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ మనందరినీ ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తున్న గురువులను ఎన్నటికీ మర్చిపోకూడదన్నారు . తమ ప్రవచనాలతో భక్తులకు ఆధ్యాత్మిక చైతన్యం కల్పించిన స్వామీజీలను ఆశ్రమ కమిటీ తరపున ఉపాధ్యక్షుడు ఎంవీ శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి కె. సత్యనారాయణ సత్కరించారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యులు, దాతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



సంతపాలెం పాఠశాలలో పిల్లలు వేసిన చిత్రాలతో ఎంఈవో అనురాధ, ఉపాధ్యాయులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పరిధి చినగదిలి దరి సంతపాలెం పాఠశాలలో శనివారం ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లైమేట్ ఫ్రంట్ వైజాగ్ గ్రూప్, వైజాగ్ టుగెదర్, డ్రాగన్ జెడ్ గ్రూప్ ప్రతినిధులు పాఠశాలను సందర్శించారు. ఆయా గ్రూపుల ప్రతినిధులు ఇక్కడ విద్యార్థులకు నీరు–ప్రాధాన్యతపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చినగదిలి మండలం ఎంఈవో-2 అనురాధ చిత్రలేఖనంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు పర్యావరణంపై అవగాహన కలిగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.శ్రీనివాసరావు, ఆయా సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగు నీరు వృథా



హనుమంతవాక వద్ద రోడ్డు మధ్యలో ఫౌంటైన్ మాదిరిగా పైప్‌లైన్

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి జాతీయరహదారిని అనుకొని హనుమంతవాక కూడలి నుంచి విశాలాక్షినగర్ రోడ్డు మధ్యలో జీవీఎంసీ నీటి పైపులైన్ శనివారం పగిలిపోయింది. దీంతో తాగునీరు వృథాగా పోయింది. నీరు లీకవడంతో ఫౌంటైన్‌ను తలపించింది. కొంతసేపటికి రోడ్డంతా నీరు చేరి వాహనరాకపోకలకు ఇబ్బంది కలిగింది. స్థానికులు సమాచారం అందించడంతో జీవీఎంసీ ముడసర్లోవ నీటి సరఫరా సిబ్బంది అక్కడకు చేరుకొని నీటి వృథాను అరికట్టారు. అక్కడ రోడ్డు తవ్వి పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి జీవీఎంసీ జోన్-2 జెడ్సీ కనకమహాలక్ష్మి చేరుకుని పనులు పరిశీలించారు.

సమతుల్య ఆహారంతో ఆరోగ్యం

ఏయూక్యాంపస్: రోగనిరోధక శక్తిని పెంపొందించుకుంటూ వ్యాధులను దూరం చేసుకోవాలని న్యూట్రిషన్, వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి అన్నారు. బీచ్‌రోడ్డులో నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సహజ ఆహారాలైన పండ్లు, ఆకుకూరలు, వెల్లుల్లి, బాదం వంటివి నిత్యం తీసుకోవాలన్నారు.

కృష్ణా డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన విద్యార్థులతో కళాశాల ఆధ్యాపక బృందం

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈశిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. విజయబాబు అధ్యక్షతన రక్తదాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ ,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు పాల్గొని విద్యార్థుల నుంచి బ్లడ్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ పోలా. ఉమామహేశ్వరరావు, జి.వి.ప్రతాప్,బి.లక్ష్మి, బి.నాగేశ్వరరావు, రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ సాయి కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాతావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



వీఎంఆర్‌డీఏ ఉద్యోగ భవన్‌లో విద్యుత్ దీపాలు ఆపిన దృశ్యం

విశాఖ సిటీ: వాతావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పిలుపునిచ్చారు. వరల్డ్ వైల్డ్ ఫండ్ వారు నిర్వహించిన ఎర్త్ అవర్‌లో భాగంగా శనివారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంతో పాటు అన్ని పర్యాటక పార్కులు, కేంద్రాల్లో విద్యుత్ దీపాలను ఆపి సంఘీభావం తెలిపారు. దీని వల్ల విద్యుత్ వినియోగం తగ్గి భూతాపం కూడా తగ్గుతుందన్నారు.

నిలిచిపోయిన నేవీ వాహనం

ఆరిలోవ: జాతీయరహదారిపై హనుమంతవాక కూడలి వద్ద నేవీ వాహనం నిలిచిపోయింది. నగరం నుంచి మధురవాడ సైడు మిస్సైల్‌ను తీసుకొని వెళుతున్న భారీ నేవీ వాహనం శనివారం రాత్రి హనుమంతవాక వద్ద మరమ్మతులకు గురైంది. దీంతో రోడ్డు మధ్యలోనే అడ్డంగా ఆ వాహనం నిలిచిపోయింది. దాని వెనుక ఉన్న వాహనాలు నిలిచిపోయి బారులుదీరాయి. అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసులు నేవీ సిబ్బందితో కలిసి ఆ వాహనాన్ని పక్కకు తరలించడానికి విశ్వప్రయత్నాలు చేశారు. వాహనాన్ని పక్కకు నెట్టడానికి గంటల సమయం పట్టింది. అనంతరం ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

సెమీస్‌కు మూట్ కోర్టు పోటీలు



న్యాయమూర్తికి జ్ఞాపిక అందిస్తున్న న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ సీతామాణిక్యం

విశాఖ విద్య: న్యాయ విద్యార్థుల్లో నైపుణ్యాలను, సామర్థ్యాలను పెంపొందించే విధంగా జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు జరుగుతున్నాయి. ఏయూ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు రెండో రోజు శనివారం ఎంతో ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 24 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరగనున్న సెమీ ఫైనల్స్‌కు నాలుగు జట్లు చేరుకున్నాయి. శనివారం నిర్వహించిన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత న్యాయమూర్తులు డాక్టర్ బి.సత్యనారాయణ, డి.ధర్మారావు, విశాఖ న్యాయవాదుల సంఘం పూర్వ అధ్యక్షులు కె.ఏ ప్రకాష్, బి.వి.ఆర్.మూర్తి వ్యవహరించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, న్యాయ కళాశాల పూర్వాచార్యులు ఆచార్య వి.కేశవరావు ఆచార్య ఎస్.సుమిత్ర, ఆచార్య వి.రాజ్యలక్ష్మి, ఆచార్య చంద్రకళ, మూట్ కోర్టు పోటీల సమన్వయ కర్త డాక్టర్ ఎల్.వి.కె ప్రసాద్, డాక్టర్ పల్లవి పాల్గొన్నారు.

ఉక్కు కార్మికుల తొలగింపును 'కూటమి' అడ్డుకోవాలి



నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని పరిరక్షించేది మా ప్రభుత్వమే, ప్యాకేజీ వచ్చింది మా వల్లేనని ఊదరగొట్టిన టీడీపీ, జనసేన నేతలు స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికుల అక్రమ తొలగింపులను అడ్డుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ పోరాట కమిటీ లక్ష కరపత్రాల వంపిణీ కార్యక్రమం శనివారం మద్దిలపాలెం కూడలిలో చేపట్టింది. ఈ నెల 21 నుంచి 24 వరకు విస్తృతంగా కార్మికుల్లోనూ, ప్రజలు రద్దీగా ఉండే రైతుబజార్లు, బస్‌స్టాండ్‌ల వంటి ప్రాంతాలలో కరపత్రాలు పంపిణీ చేయాలని పిలుపునిచ్చిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జోన్‌కార్యదర్శి పి.వెంకటరావు, ఉపాధ్యక్షుడు కె.కుమారి, జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆర్గనైజ్ సెక్రటరీ వి.కృష్ణారావు, తోపుడుబండ్ల సంఘం నాయకులు ఎ.సింహాచలం, ఎ.అప్పారావు, రమేష్, శ్రీను, సీనియర్ నాయకుడు జి.పోలేశ్వరరావులు పాల్గొన్నారు.

పెంచిన ఇంటిపన్నులు రద్దు చేయాలి

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ అన్యాయంగా పెంచిన ఇంటి పన్నులు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీ 18వ వార్డ్ అంజయ్య నగర్‌లో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో పేర్కొన్నారు. ఈ యాత్రలో భాగంగా సీపీఎం నాయకులు కాలనీలోని ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ అంజయ్య నగర్‌లో ప్రభుత్వ స్కీమ్ ఇళ్లకు ఏడాదికి రూ.250 పన్ను ఉండేదన్నారు. ఆయా ఇళ్లను ఆస్తివిలువ ఆధారిత పన్నుగా మార్చడంతో ఒక్కో ఇంటికి ఏడాదికి రూ.3 వేలు నుంచి రూ.5 వేలు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇది మురికివాడ అయినప్పటికీ జీవీఎంసీ అధికారులు ఏకపక్షంగా పన్ను విలువ పెంచడాన్ని ఖండించారు. అనంతరం ఆరిలోవ హెల్త్ సిటీలోని హాస్పటల్స్‌తో పాటు వెంకోజీపాలెంలోని మెడికవర్ ఆసుపత్రి వ్యర్థాలను నేరుగా గెడ్డలోకి వదలడంతో గెడ్డను ఆనుకొని ఉన్న అంజయ్యనగర్ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దుర్వాసన భరించలేక అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. విద్యుత్ బిల్లులు గతంలో కంటే 200 రెట్లు పెరిగాయన్నారు. ఈ నేపథ్యంలో ఇంటిపన్నుతో పాటు ఆయా ధరలను తగ్గించే విధంగా జీవీఎంసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.